
కథ

# ఎరువుచింత

- పల్లా రోహిణీకుమార్



“ఊరుకోరా బావూ ఉసులొత్తాయీ.... పల్లకోరా బావూ పాములొత్తాయి... జో, పాములకు పది ఏల్లూ.... నీకు నూరేల్లూ...జో” గడపలోని పెణక వాసానికి వేలాడుతున్న ఉయ్యాలలోని మనమడికి జోలపాట పాడుతోంది గౌరమ్మ.

“అప్పా సిన్న పొవ్వాకు రెమ్ముందేటి? సుట్టముక్క నేక నోరు కంపుగొట్టెత్తంది” అంటూ గడపలోకి వచ్చి కూర్చొంది ఎదురింటి పారమ్మ.

“రాయమ్మా! రాయె అనుమంతుడు అడుక్కుతింతే గరుతమంతుడు గోక్కుతిన్నాడట. నిన్నటి నుండి సుట్ట నేక నేను సుట్టికి పోతుంటే మద్దిని నీ గోలొకటి. పేనమదొకలాగయిపోయి మరుండలేక పొద్దుట మా సిమాసలం ఎరువు కోసం పట్నం బయదేలతుంటే నాయినా పెద్దరెమ్మన్న పొవ్వాకు తేవడం మరిసిపోకని మరీ, మరీ సెప్పినాను. తెత్తాడో, తేడో!” అంది గౌరమ్మ.

మనమడు నిద్రలోకి జారుకున్నాక ఇద్దరూ కబుర్లలో పడ్డారు. “అప్పా సేసినెవసాయం సేత్తన్నం గాని ఆపాటి గింజలు ఇంటికొచ్చీసరికి తలపేనం తొక్కత్తందనుకో” అంటూ “అవునూ రవనెటెల్లిందేటి?” గౌరమ్మ కోడలు నుద్దేశించి అడిగింది పారమ్మ.

“ఇంటి ల్ల పాదీ కూకోనుంతే మరి దినం గడొద్దా? పిక్కి రోడ్ని నా దగ్గరుం చీసి పొయ్యిలోకి నెరా నేవని సింతలసెరువు దగ్గర జనువులొలుపుకెల్లింది. ఆడా అలగ ఎరువు గుండకని మగ్గం లోని కండినాగ ఇంటికి, పట్నంకి తిరుగుతండు. పొలానికాసెల్తే పేనము సూరుమంతంది” గౌరమ్మ నిట్టూర్చింది.

“పోనీ ఆ దొరబావు దగ్గరుంతాదేటోగుండ. మొన్నొకమాట మా సిన్నోడెల్లి తెచ్చుకుండు” అని చెప్పింది పారమ్మ.

“అలగనడిగితే నా పొలానికే ఎరువు నేక నానా పత్రాకులు పడతన్నాను. మద్దిలోన నీ గోలేట్రా నాయనా!” అని అంతండట. అతగాని పొలం పక్కనే మా మడిసెక్కుంది కదా! రెండు మూడుసార్లు అమ్మీమని అడిగినాడట. ఉన్న పొలమంతా సాలదని బావూ అదమ్మిత్తే మా బతుకు సంగతేటని! అడిగితే అదా ఆ కోపం తోటే గదా నీటి సుక్కలివ్వకుంట ముప్పుతిప్పలు పెట్టీసినాడు. సివరకు బట్టతడుపు సినుకులు పడ్డాయంతే యిదా ఈ సికాకొచ్చి పడ్డాది. ఎన్నొదిలి నేలకి గుండెయ్యకపోతే పడిన కట్టమంతా వొట్టిన పోద్ది. పచ్చగడ్డి కింద పసువులికేసీడమే తప్ప మరొక్క దిక్కునేదు” అంటూ గౌరమ్మ వీధి వైపు చూసింది.

***

పట్టణంలో మార్కెట్ యార్డు దగ్గర గందరగోళంగా ఉంది. ఎరువుల కోసం సుమారు ఇరవై, పాతిక గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి చేరుకొన్నారు. ఈ రోజైనా ఎరువులిస్తారో! లేదో! అందరిలోనూ ఒకటే ఆందోళన.

వచ్చిన నుండీ అలాగే ఎండలో నిలబడి ఉండడం వలన పొద్దున్ననగా తాగిన గెంజి నీళ్ళు సింహాచలం కడుపులో ఎపుడో ఇంకిపోయాయి. మధ్యాహ్నం ముదిరిన ఎండకి సింహాచలం ముఖము చెమటతో తడిసిపోయింది. మెడలోని తువ్వాలుతో ముఖాన్ని తుడుచుకొన్నాడు.

నాలుక పిడచ కట్టుకు పోవడంతో మంచినీళ్ళైనా తాగి వస్తానని తోటి రైతుకి చెప్పి దగ్గరలో ఉన్న పాన్‌షాపు వైపుకి దారితీసాడు.

"ఏట్రోయ్ సివాచలమో గుండబస్తా అంది పోయిందేటి? బడ్డీ దగ్గర యిస్రాయింగ నిలబ డ్డావు!" తన ఊరి రైతు సింహాచలాన్ని ఉద్దేశించి ఇకటమాడేసరికి ఎక్కడలేని కోపం, చిరాకు వచ్చాయి.

"అంది పోద్దిరా. అంది పోద్ది ఎందుకంది పోదు! ఏడిసి నోడికి ఎక్కిరించడమంతే ఇదే. నీకేటి పోయింది ఆ దొరబావు అడుగులికి మడు గులొత్తన్నావు కదా? నీవెన్నైనా మాట్లాడతావు" అంటూ చేతిలోన వాటరు పేకెట్టు చింపబోయిన వాడల్లా మార్కెట్ యార్డు దగ్గర కేకలు, వినబడే సరికి 'ఒక వేల స్టాకు గట్టా వచ్చిసిందేటి!' అను కొని అటువైపు పరుగుతీసాడు.

అక్కడికి వెళ్ళేసరికి స్టాకు తక్కువ వచ్చిందని మిగతా సరుకు తరువాత వస్తుందని మొత్తం సరుకు వచ్చేవరకు ఎవరికీ ఇవ్వొద్దని ఛైర్మన్‌గారు చెప్పారని అందువల్ల ఎరువులు ఇవ్వడం లేదని తెలిసింది.

సింహాచలం గుండెలు గుభేలుమన్నాయి. 'ఉన్న ఒక్క మడిసెక్కకి దినం దీరకుంటంది. సాయంత్రానికల్లా గుండెయ్యకపోతే ఉన్న నీటి సుక్కలు యింకి పోతాయి. ఎండల బడిపోడం. 'దరిద్రగొట్టోడు తడికల దడిలోకి దూరితే వడ గల్ల వాన పట్టుకొందట – అలగుంది నా పరిస్తితి' అనుకొంటూ. పూర్తిగా నీరసం ఆవహించడంతో అలాగే గోడకి చేరబడిపోయాడు.

ఉదయం నుండి ఎరువుల కోసం ఎంతో ఆశగా ఎదురుచూసి, చూసి తీరా స్టాకు వచ్చేసరికి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో అప్పటికే సహనం కోల్పోయిన రైతులు ఆగ్రహంతో ఒక్క సారిగా గోడౌను మీదకి దాడిచేసారు.

మార్కెట్ యార్డు సిబ్బంది భయంతో ఛైర్మన్ గారికి ఫోను చేసేసరికి కొద్ది క్షణాల్లో వ్యాను నిండా పోలీసులు బిల,బిలమంటూ వచ్చి రైతు లపై లాఠీలతో విరచుకు పడ్డారు. సింహాచలం తలపై లాఠీదెబ్బ పడేసరికి అమ్మో! అంటూ అక్కడే కూలబడిపోయాడు. అల్లా సింహాచలం లాంటి రైతులెందరికో దెబ్బలు తగిలాయి.

***

పట్నం నుండి ఎరువుతో పాటు, పొగాకు తెస్తాడని ఆశగా ఎదురు చూస్తున్న గౌరమ్మకి కొడుకు దెబ్బలు తగిలి ప్రభుత్వాసుపత్రిలో ఉన్నాడన్న వార్త వినేసరికి రాటకి చేరబడి ఉన్న దాయల్లా ఒక్కసారిగా లేచి పెడబొబ్బలు పెడుతూ వీధిలోకి వచ్చి అప్పుడే స్కూలు నుండి ఇంటికి వస్తున్న పెద్ద మనుమడిని వాళ్ళమ్మని పిలుచుకు రమ్మని పంపించింది. ఇరుగు, పొరుగు వారు వచ్చి గౌరమ్మని ఊరడిస్తున్నారు.

విషయం తెలుసుకొని పరుగు, పరుగున ఇంటికి వచ్చిన సింహాచలం భార్య రమణమ్మ కాసిన్ని మంచి నీళ్ళు తాగి పిల్లలిద్దర్ని గౌరమ్మకు అప్పగించి ఆటోకి పట్నం బయలుదేరి పోయింది.

ఆసుపత్రికి రమణమ్మ చేరుకొనే సరికి అక్కడ బాధితులు, వారి బంధువుల అరుపులు, ఏడు పుల తోను, పరామర్శలకి వచ్చీ, పోయే వాళ్ళతో గందరగోళంగా ఉంది. చుట్టూ పోలీసులు ఉన్నారు. పత్రికల వాళ్ళు, టీ.వి. వాళ్ళు వచ్చి ఫొటోలు తీసుకొని ఏవేవే వ్రాసుకొని వెళ్ళిపోతు న్నారు. ఆసుపత్రి సిబ్బంది దెబ్బలు తగిలిన వాళ్ళకి చికిత్స చేస్తున్నారు.

రమణమ్మ తన భర్త ఎక్కడున్నాడో కనుక్కొని వెళ్ళి చూసేసరికి సింహాచలం తలకి కట్టుతో మూలుగుతున్నాడు. తలకి కట్టిన బ్యాండేజి



## శ్రియ కాకమ్మ కథలు....

ఇటీవలి కాలంలో శ్రియకి అదృష్టం ఆమడ దూరంలోనే ఉండిపోతోంది. ఒకప్పుడు తెలుగులో ఆమెది 'గోల్డెన్ లెగ్'. ఇప్పుడు ఐరన్ లెగ్‌తో సమానం. ఆమెతో సినిమా అంటేనే దర్శక, నిర్మాతలు ఆమడ దూరం పారిపోతున్నారట! దానికీ కారణం ఉంది. ఇటీవల ఆమె నటించిన రెండు చిత్రాలు విజయవంతం కాకపోవడంతో తెలుగులో ఆమెకు తలుపులు మూసుకుపోయాయి. కోలీవుడ్‌లోనూ దాదాపు అదే పరిస్థితి ఉండడంతో బాలీవుడ్ వైపు పరుగులు పెట్టింది. అక్కడ హీరోలు ఆమెను 'ఆద రించకపోవడం'తో బాలీవుడ్ కన్నా కోలీవుడ్ నయమని రివర్స్‌గేర్‌లో తిరిగి వచ్చేసింది. ఎక్కడా అవ కాశాలు లేక ఖాళీగా కూర్చున్న శ్రియపై మళ్లీ బాలీవుడ్ దర్శక,నిర్మాతల దృష్టి పడింది. ఆమెకు అవ కాశాలు ఇస్తామంటూ ముందుకువచ్చారు. హీరోయిన్‌గా కాదట! చిన్న చిన్న వేషాలు ఆఫర్ చేశా రట! ఏదైనా సరే 'సై' అంటూ బాలీవుడ్‌కి హడావుడిగా బయలుదేరింది శ్రియ! ఇక తాను బాలీవు డ్‌లో స్థిరపడతాననీ, అక్కడ అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయంటూ కాకమ్మ కథలు చెప్పి బయలుదేరింది!

నుండి రక్తం చిమ్మి మరకలుగా కనబడుతు న్నాయి. ఆ స్థితిలో సింహాచలాన్ని చూసి రమ ణమ్మ దుఃఖాన్ని ఆపుకోలేక భర్తని పట్టుకొని వెక్కి, వెక్కి ఏడ్చింది. భార్యని సింహాచలం సము దాయించాడు.

"ఏటో ఉన్న అరెకరా పొలానికి ఎవసాయం సెయ్యడానికి అర్ర, పర్రాకులు పడిపోతున్నాము. సేసినెవసాయం యికసాల్లు. నీకేటైతే నేను, పిల్లలు దిక్కుమాలినోలమై పోతాము. మరింకిక్క డుండొద్దు. ఎక్కడికైనా ఎలిపోయి కూలి, నాలి సేసికొని బతికిద్దుము. ఉన్ని నాడు తింతాము. లేనినాడు కడుపుల కాల్లెట్టుకొని పడుకుంతాము. మన కర్మ ఎలాగుంటే అలా గుంతాది. కునుకు తున్న నక్కమీద తాటిపండు పడినట్టుంది. ఎరు వుకని తెచ్చిన డబ్బులు ఆసుపత్రి పాలయి పోనాయి" అంటూ రమణమ్మ ఏడుస్తుంటే నర్సు వచ్చి కోప్పడింది. చీరకొంగును నోటికి అడ్డం పెట్టుకొని దుఃఖాన్ని దిగమింగుకొంది.

***

సింహాచలానికి ప్రమాదమేమీ లేదని, రెండు, మూడు రోజుల్లో ఇంటికి పంపించి వేస్తారని తెలిసి గౌరమ్మ మనసుకొంత కుదట పడింది. 'కేరేజు పట్టుకొని రేపు తెల్లారే సరికి బయదేలి పోవాల' అని మనసులో అనుకొంది.

వేకువచీకటి. కార్తీక మాసపు చలిలో ఊరు ఇంకా నిద్రపోతూనే ఉంది. కార్తీక దీపాలు వెలి గించడానికి మహిళలు కొందరు ఇంటిముందు నుండి ఏటి వైపుకి కబుర్లు చెప్పుకొంటూ వెళ్త న్నారు. ఆ అలికిడికి గౌరమ్మ నిద్రలేచి పెరటి వైపుకి బయలుదేరింది. మసక వెలుగులో దొర బాబు కళ్ళం దగ్గర ఏదో అలికిడి అయినట్లు అని పించింది. మరింత దగ్గరికి వెళ్ళి చూసింది. ఎరువు బస్తాల లోడును కొందరు ట్రాక్టరు నుండి దొరబాబు కళ్ళానున్న షెడ్ లోనికి చేరవేస్తు న్నారు. పంచె ఎగగట్టి దొరబాబు సెల్‌ఫోనులో మాట్లాడుతూ అటూ, ఇటూ తిరుగుతూ ఉన్నాడు. గౌరమ్మకి అక్కడ జరుగుతున్న వ్యవ హారమంతా అర్థం అవుతోంది.

''సెయిర్మెన్ గారో మీ మేలు మరిసిపోనండి. సరుకు మూడో కంటికి తెలీకుండా కల్లానికి సేరి పోయింది. ఆలసేతిల బడిపోతే మనకేటి మరీ మిగలవు. మనసేతికి మట్టి అంటకుండ పని కాని చ్చీసినారు. లాఠీచార్జీలో మా ఊరోలు కొందరు దెబ్బలు తిన్నారు కదా! ఈ వేల పెసిరెంటు గారితో కలిసొత్తాను. పరామర్శ అయిపోద్ది. మిమ్మల్నొకసారి కలిసినట్టూంటాది. అవన్నీ ఫోన్లోనెందుకు గాని మీ దగ్గరికి వచ్చినాక మాట్లా డుకుందుం'' దొరబాబు మాటలు స్పష్టంగా గౌర మ్మకు వినబడ్డాయి.

గౌరమ్మ తన కళ్ళను తానే నమ్మలేక పోయింది. 'నాయినా దొరబావో ఇక్కడ్నుండే నాటకమంతా ఆడించెత్తన్నావన్నమాట. నువ్వు సిన్న, సిన్నింటోడివి కాదురో. ఊర్లోన పెసిరెంటు, పట్నంల సెయిర్మెను తోటి జట్టు గట్టీసి పనులు సక్క బెట్టుకుంతన్నావు. నీలాంటి జబరు సేతు లోల్లకి ఎరువులు మాలాటోల్లకి దరువులు. నువ్వు మేకతోలు కప్పుకొన్ని పులివిరా నాయినా. ఏదో సిమ్మాది రప్పన్న దయవలన నా కొడుకు పేనాలతో బయట పడ్డాడు. ఇలాగొదిలిత్తే ఇంకెం దర్ని తినెత్తావో! నా కొడుకుల్లాటోల్ల ఎందరి బతు కులు బుగ్గయిపోతాయె!' అనుకుంటూ కాళ్ళు కడుక్కొని ఇంటివైపు నడిచింది.

***

గౌరమ్మ పట్నం వెళ్ళడానికి చేతిలో కేరేజుతో ఆటో కోసం ఎదురు చూస్తూ ఉంది. తన కెదురు గానే దొరబాబు, ప్రెసిడెంటు కలిసి మోటారు సైకిలు మీద ధూళి రేపుకొంటూ వెళ్ళిపోయారు. గౌరమ్మకి వేకువ రాత్రి చూసిన దృశ్యం కళ్ళెదుటే కదలాడుతోంది. 'ఎల్లాఁరా ఎల్లండి. అన్ని రోజులు మీవి కాదు. సంవచ్చరము లోన ఒక్క రోజైనా మాడుండక పోద'ని అనుకొంది.

ఇంతలో కిర్రుమంటూ ఆటో వచ్చి ఆగే సరికి గౌరమ్మ ఈ లోకంలోకి వచ్చి గబ, గబా ఆటో ఎక్కికూర్చొంది.




''నాయినా ఆటోని బేగి తోలురా! ఆసుపత్రి లోన ఆడెలాగున్నాడో! నేనెల్లి కోడల్ని తిరిగింటికి పంపాల. ఇంటి దగ్గర సిన్న పిల్లల్నొదిలీసి నాము'' అంటూ ఆటోవాడ్ని గాబరా పెట్టింది. ''ఇదేటి ఇమానమేటి ఎగిరిపోడానికి. ఈ గతు కులు రోడ్డు మీద స్పీడుగెల్తే ఎగిరెల్లి మడిలోన పడతాము'' అంటూ గేరు మార్చాడు.

ఆసుపత్రికి చేరుకొనేసరికి బెడ్ మీదున్న సింహాచలానికి టిఫిన్ పెడుతోంది రమణమ్మ. గౌరమ్మ కొడుకుని చూసి ఏడుస్తూ ''నాయినా సిమాసలమో ఎంత పనియి పోయిందిరా. ఆల కేటి గాడుపొచ్చిందో గాని 'అడవి పందులు సేని మేసిత్తే ఊరపందులు సెవులు కోస్సినారట' అల గుంది ఆ గండల తిత్తవ. అంటూ భోరుమంది.

అత్తను గోల పెట్టొద్దని వారించి భర్త దగ్గర ఉండమని చెప్పి తాను ఇంటికి బయలుదేరింది.

సింహాచలం నిన్న గొడవ ఎలా జరిగింది. ఎందుకు జరిగిందీ గౌరమ్మకు వివరించాడు.

గౌరమ్మ కళ్ళను పైటకొంగుతో తుడుచుకొని ''బాబో దీనికంతటికీ కారనం మరెవులో కాదు. మనూరికి శనిలా దాపురించిన ఆ దొర గండడు. ఆడు తండ్రిని మించి పండనుకో. మీ నాయన్ని ఆల నాయిన ఎన్ని సికాకులు పెట్టీసాడనుకొ న్నావు. నీటి దగ్గిట తగువే, గట్టు దగ్గిటా తగువే. మీ నాయినా పంటింటి కొచ్చీవరకు పడుకుం డోడు కాదు. మా రాజు తండ్రి'' గౌరమ్మ గతాన్ని గురించిన జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయింది.

''అమ్మా ఈ ఊర్లో నుండి ఎవసాయం సెయ్యిడం కంట ఎటో ఎల్లి ఏ కూలో, నాలో సేసుకుంతే బాగునట్టుంది. ఈ యాతన తప్పొద్ది'' అన్నాడు సింహాచలం నీరసంగా.

''ఒరే బావ్ ఉన్న సెక్క ముక్కమ్మీస్సి దేశాల్లం టెల్లి పోతే ఊర్లోన మరింత ఆచ్చేపన. నా పేనము న్నంత వరకూ ఆ పని సెయ్యకిమీ. నన్ను ఇక్కడే బుగ్గయి పోనీ. ఇంటికి పెద్ద దిక్కు నువ్వే మన సొదిలిత్తే నిన్ను నమ్ము కొన్న మేమేటయిపో వాల? పేదోడికి, పెమా దాలకి దగ్గిర సుట్టరిక ముంది గావాల. మన మాటిని వదిలీయాల నుకున్నా అవి మనల్ని వదలకుంటున్నాయి. బొందిలో పేనము న్నంత వరకు ఇలగ ఏటికి ఎదిరీదడమే'' గౌరమ్మ సింహాచలా నికి సర్ది చెప్పింది.

***

ఇంతలో సింహాచలంను పరామర్శించడానికి ఊరి వాళ్ళలో కొంతమంది, చుట్టాలు, పట్నంలో చదువుతున్న కుర్రాళ్ళతో పాటు వచ్చారు. వాళ్ళలో ఎరువుల్లేక ఇబ్బంది పడుతున్న వారు న్నారు. సింహాచలాన్ని విశ్రాంతి తీసుకోమని చెప్పి వారందరినీ ఆసుపత్రి బయట ఉన్న చెట్టు క్రిందకి తీసుకొని వెళ్ళింది. దొరబాబు కళ్ళాన జరి గిన సంఘటన అంతటినీ వారందరికీ వివరిం చింది. మరల వారితో ''ఔనర్రా మన బతుకులి లగ సితికి పోడమేనేటి? మన బతుకుల్తోటి ఆడు కొంతన్న ఆ గండల్ని ఇలగొదిలిత్తే ఎవసాయాలు మరి సెయ్యలేము. సెయ్యి నివ్వరు. ఆల దగ్గిటే కూలీలగ మారిపోవాల. ఎవులండ సూసి ఎగురు తున్నారో ఆల కొమ్ములిరిసీయాల'' అంటూ వర సకి మనుమడైన కాలేజీ కుర్రాడి దగ్గర కాగితం తీసుకొని వినతి పత్రం రాయించి, వారందరినీ పురమాయించి సరాసరి సబ్ కలెక్టర్ గారి ఆఫీ సుకు తీసుకొని వెళ్ళింది. కలెక్టరు గారికి వినతి పత్రం సమర్పించి తమ గ్రామంలో జరుగుతున్న అక్రమాలకు తమలాంటి వాళ్ళు ఎలా బలై పోయిందీ వివరించింది. తిరిగి వచ్చేటప్పుడు బజారులో కొనుక్కొని తెచ్చుకున్న పొగాకు కట్టను జాగ్రత్తగా సంచిలో సర్దింది.

తెల్లవారింది. అప్పటికే గౌరమ్మ కాలకృ త్యాలు తీర్చుకొని టీ త్రాగటానికి సిద్ధపడుతోంది. నిన్న తనతో పాటు వచ్చిన మనమడు పరుగు, పరుగున చేతిలోన న్యూస్ పేపరుతో వచ్చి రాత్రికి, రాత్రే మన ఊరిలోనికి పై అధికారులు వచ్చి దొరబాబు కళ్ళంపై దాడి చేసారని, అక్ర మంగా నిల్వఉంచిన ఎరువు బస్తాల స్టాకును పట్టుకొన్నారని, దొరబాబుని కూడా అరెస్టు చేసి తీసుకొని వెళ్ళిపోయారని, దీని వెనుక ఎవరెవరి హస్తముందో మొత్తం కూపీ లాగుతున్నారని ఆ విషయం పేపర్లో ఫొటోలతో సహా వచ్చిందని గౌరమ్మకు చూపించాడు.

మనమడ్ని సింహాచలం దగ్గర ఉండమని చెప్పి ఆసుపత్రి బయటకు వచ్చి దూరంగా ఉన్న చెట్టుక్రిందకు వెళ్ళి కూర్చొని 'నిన్న నేనిచ్చిన కాయితం సిత్తు కాయితం కింద పోనేదన్న మాట' అనుకొంటూ ముట్టించిన చుట్టను గుండెలనిండా పీల్చి గాల్లోకి పొగ వదిలింది. తృప్తిగా.

★

చిరునామా:
పల్ల రోహిణీకుమార్
నాగూరు (గ్రామం)
రావివలస (ఎస్.ఓ)
గరుగుబిల్లి (మండలం)
విజయనగరం జిల్లా - 535 525
సెల్: 94402 01310